# అక్కడ సెటిలర్లే కీలకం

**గ్రేటర్‌లోని పలు నియోజకవర్గాల్లో కీలక పాత్ర**

**ఇతర రాష్ట్రాలకు చెందిన ఓటర్లు సైతం ప్రభావం**

**కొన్ని నియోజకవర్గాల్లో వారే నిర్ణేతలు**

**అభ్యర్థుల విజయావకాశాల్లోనూ కీలకం**



హైదరాబాద్, నవంబర్ 14,ప్రభాతవార్త: నగర శివారుల్లోని కొన్ని నియోజకవర్గాలు మినీ భారత్‌ను తరించేలా ఉంటాయి. అనేక ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిపోతుంటారు. దేశంలోని ఏ ప్రాంతంలోని వారు ఇక్కడి వచ్చినా వారికి కావాల్సిన ఆహారం..భాష అన్నీ ఇక్కడ అనువుగా ఉంటాయి. అందుకే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కూడా ఇక్కడ స్థిరనివాసం ఏర్పరచుకుంటారు. ఇక్కడి రాజకీయాల్లో భాగవుతుంటారు. ఎన్నిల్లో తమ ఓటుహక్కును వినియోగించుకుంటారు. వీరు ఓట్లు కూడా అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలోనే ఉంటాయి. హైదరాబాద్,రంగారెడ్డి, మేడ్చ ల్ జిల్లాల పరిధిలోని దాదాపు అన్ని నియోజకవ ర్గా ల్లోనూ ఇతరప్రాంతాలనుంచి వచ్చి స్థిరపడ్డ ఓటర్లు ఉంటారు.

• మేడ్చల్ నియోజకవర్గంలోని ఇండస్ట్రియల్ ప్రాంతాలు ఎక్కువ. ఇక్కడ పనిచేసేందుకు దేశంలోని వివిధ ప్రాంతీల నుంచి ప్రజలు వస్తుంటారు. ఈనియోజకవర్గంలో 5.5లక్షల ఓట్లు ఉంటాయి. ఇందులో దాదాపు 90వేల నుంచి 1లక్ష మంది ఓటర్లు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన వారివే ఉంటాయి.

• శేరిలింగంపల్లి పూర్తిగా మినీభారత్‌ను తరించే విధంగా ఉంటుంది. ఇక్కడ కూడా సుమారు 5.9లక్షల ఓట్లు ఉంటాయి. ఇందులో స్థానికంగా పుట్టి పెరిగిన వారు 25-30శాతం ఉంటారు. మిగిలిన వారిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఇతర ప్రాంతాలకు చెందిన వారు అధికంగా ఉంటారు. ఆతర్వాత మహారాష్ట్ర, కర్నాటక, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి వచ్చినవారే ఎక్కువ. వీరంతా అనేక ఏళ్ల క్రితం ఇక్కడ వచ్చి స్థిరపడ్డారు. ఖరీదైన గెటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలు ఇక్కడ జరుగుతుండటంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు మొదట ఇక్కడ ఉండేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్ల ప్రభావం ఇక్కడ అభ్యర్థుల విజయావశాలను నిర్ణయిస్తుందని సీనియర్ నాయకులు సైతం విశ్లేసిస్తుంటారు.

• రాజేంద్రనగర్ సెగ్మెంట్‌లోనూ ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడ్డ ఓటర్లు గణనీయంగా ఉంటారు. ఒకవైపు సాఫ్ట్‌వేర్‌రంగంతోపాటు పారిశ్రామిక వాడలు సైతం ఉన్నాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాల నుంచి వచ్చి మణికొండ ,కోకాపేట్ అత్తాపూర్,బండ్లగూడ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు.

• కూకట్‌పల్లి నియోజకవర్గంలో కూడా ఇతర రాష్ట్రాలనుంచి వచ్చి స్థిరపడిన వారి సంఖ్య గణనీయమే..ఇక్కడ మొత్తం 3.9లక్షల మంది ఓటర్లు ఉంటారు. అనేక చిన్నచిన్న కాలనీలు ఉన్నాయి. మధ్యతరగతి వారి కాలనీలతోపాటు, బస్తీలు కకూడా అధికంగా ఉంటాయి. మొత్తం ఓటర్లలో దాదాపు 1.70లక్షల మంది ఓటర్లు ఇతర ప్రాంతాల నుంచి వచ్చివారే ఉంటారని అంచనా. తెలంగాణలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిలో ఎక్కువమంది ఇక్కడే స్థిరపడ్డారు.

• కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో దాదాపు 5.5లక్షల ఓట్లు ఉండగా ఇందులో ఇతర రాష్ట్రాలకు వారి ఓట్లే 2లక్షల వరకు ఉంటాయని అంచనా.

• జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లోనూ ఇతర ప్రాంతాల ఓటర్లు ప్రభావం ఎక్కువ. ఇక్కడ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినవారి సంఖ్య గణనీయంగా ఉంటుంది.

• మహేశ్వరం నియోజకవర్గంలోని ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడ్డవారే ఎక్కువ. 500వరకూ బస్తీలు ఉంటాయి. మొత్తం 4.5లక్షల వరకు ఓటర్లు ఉంటారు. సరూర్‌నగర్ మండల పరిధిలోని పలుబస్తీల్లోని ఓటర్లే అభ్యర్థుల జయాపజయాలను నిర్ణయిస్తారు. ఇక్కడ స్థానికులతో పాటు పొరుగు జిల్లాల నుంచి వచ్చి నివాసం ఉంటున్నావారి సంఖ్య గణనీయంగా ఉంటుంది. మొత్తం నియోజకవర్గంలో సుమూరు లక్షల మంది ఇతర ప్రాంతాలకు చెందిన ఓటర్లు ఉంటారు.

• మల్కాజ్‌గిరి అసెంబ్లీ స్థానం పరిధిలోనూ పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన వారు ఎక్కువగానే ఉంటారు. ఇళ్ల అద్దెలు అందుబాటులో ఉండటంతో వల్ల ఇటువైపు ఇతర ప్రాంతాల ప్రజలు ఎక్కువగా ఉంటారు. ఈనియోజకవర్గంలో మొత్తం 3.9లక్షల మందిఓటర్లు ఉండగా ఇందులో సుమూరు లక్షమంది ఇతర ప్రాంతాలకు చెందిన వారేనని రాజకీయ పార్టీలు అంచనావేస్తున్నాయి.

• ఎల్‌బినగర్ వైపు నగరం విస్తరించడంతో ఖమ్మం, నల్గొండ, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ స్థిరపడ్డారు. మొత్తం 4.88లక్షలమంది ఓటరున్న ఈ నియోజకవర్గంలో ఉంటే వీరిలో ఇతర ప్రాంతాల నుంచి స్థిరపడ్డ వారు సుమారు 1.2లక్షల వరకు ఉంటారని అంచనా.

## మన దేశ సంస్కృతి సంప్రదాయాలు చాలా గొప్పవి

చార్మినార్, నవంబరు 14 ప్రభాతవార్త : మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. దీపావళీ సందర్భంగా పాతబస్తీకి చెందిన వ్యాపారి సంజయ్ అగర్వాల్ ఆధ్వర్యంలో పలువురు వ్యాపారులు ఎమ్మెల్యే రాజాసింగ్‌ను కలిసి దీపావళీ మిఠాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ వార్త

# వాళ్లిద్దరు వసూళ్ల కింగ్‌లు

**అవినీతిలో రికార్డు సృష్టిస్తోన్న సర్కిల్ 23 డిప్యూటీ కమిషనర్, ఏసీపీ కార్యాలయాలు**

## రూ.కోట్లు కురిపిస్తున్న అక్రమ నిర్మాణాలు



కూకట్‌పల్లి, నవంబర్ 14 ప్రభాతవార్త: మూసాపేట సర్కిల్ 23 డిప్యూటీ కమిషనర్(డీసీ) కార్యాలయంతోపాటు అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ) కార్యాలయాలు అవినీతి, అక్రమార్జనకు నిలయంగా మారాయి. ఈ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ ఇద్దరు అధికారులు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఎన్నికల నిర్వహణలో జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులు నిమగ్నమై ఉండగా ఇక్కడి అధికారులు ఇదే అదనుగా భావించి అక్రమ నిరా ్మణాలు సక్రమంగా కొనసాగేందుకు తమ వంతు సహకారం అందిస్తూ రూ.కోట్లాది రూపాయల్ని తమ జేబుల్లో వేసుకుంటున్నారు. సర్కిల్ పరిధిలో అడ్డూ అదుపులేకుండా వెలుస్తున్న అక్రమ బహుళ అంతస్తుల భవనాలతోపాటు కమర్షియల్ నిర్మాణాలు ఈ ఇద్దరు అధికారుల కనుసన్నల్లో వెలుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్రోకర్లతోపాటు తమ కిందిస్థాయి అధికారులతోపాటు చైన్‌మెన్లు, లైసెన్స్ ప్లానర్లతో అక్రమ వసూళ్ళకు పాల్పడుతూ కోట్లాదిరూపాయల్ని తమ జేబుల్లో వేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టిసారిస్తే అక్రమ వసూళ్ళ బండారం బయటపడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ఓ వైపు గ్రేటర్ కమిషనర్ చెబుతుండగా తమ స్వార్థ ప్రయోజనాలకే పరిమితమైన కొందరు అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందిస్తుండడంతో రూ.కోట్ల రూపాయల గ్రేటర్ ఆదాయానికి గండి పడుతోంది. భవన నిర్మాణాలపై నిత్య పర్యవేక్షణ చేయాల్సిన సంబంధిత అధికారులు కొందరు మామూళ్ళ మత్తులో మునిగి తేలుతున్నారు. అక్రమ కట్టడాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన న్యాక్‌బృందం అసలు పనిచేస్తోందా అనే అనుమానం కలుగక మానదు. అడ్డు అదుపు లేకుండా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో డిప్యూటీ కమిషనర్‌తోపాటు ఏసీపీ, టీపీఎస్‌లు ఘోరంగా విఫలమవుతున్నారు. ఇళ్ళ నిర్మాణంలో నిబంధనల్ని పాటించడంలేదని సామాన్య మధ్య తరగతి ప్రజల్ని ముప్పుతిప్పలు పెట్టే అధికారులు, నిబంధనలు పాటించని అనేక మంది బిల్డర్ల బహుళంతస్తుల భవనాల్ని అనుమతులు లేకుండా నిర్మిస్తున్నా పట్టించుకున్న పాపాన పోవడంలేదు. కెపిహెచ్‌బికాలనీ, బాలాజీనగర్, మూసాపేట డివిజన్లలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. అప్పుడప్పుడు ఉన్నతాధికారుల దృష్టిని మరల్చడానికి ఏదో మొక్కుబడిగా కొన్ని అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా మొక్కుబడిగా నోటీసులు జారీచేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. రెసిడెన్సియల్ పేరిట అనుమతులు తీసుకుంటున్న అనేక మంది బిల్డర్లు, వాణిజ్య అవసరాల నిమిత ్తం మడిగెలు, దుకాణాల్ని నిర్మిస్తున్నారు. అనుమతుల కోసం ముందుగా ప్లాన్‌లో అన్నీ సక్రమంగానే ఉన్నట్లు పేర్కొని భవన నిర్మాణ అనుమతులు పొంది ఆ తర్వాత అందుకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. నిబంధనలు పాటించని బిల్డర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతున్న అధికారులు ఆచరణలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నారు. అపార్ట్‌మెంట్లలోని ప్లాట్లను కొన్న తర్వాత అందులో సదుపాయాలు లేక కొనుగోలుదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలి కాలంలో పెద్దఎత్తున వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకున్న దాఖాలాలు లేవు. ఏదో మొక్కుబడిగా అప్పుడప్పుడు కొన్ని అక్రమ నిర్మాణాలను పాక్షికంగా తొలగించి రంధ్రాలు చేసి సెంట్రింగ్ చెక్కలను తొలగించడం వంటి జిమ్మిక్కులకు టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. పరిసర ప్రాంతాల్లో అక్రమ అపార్ట్‌మెంట్లు కొందరు అధికారులను కుబేరులుగా మారుస్తుంది బహుళ అంతస్తుల భవనాలలో ప్లాట్లను కొనుగోలు చేసేందుకు ఉద్యోగులు, వ్యాపార వేత్తలు, రిటైర్డ్ ఉద్యోగులు, మధ్యతరగతి వర్గాల వారు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపధ్యంలో బహుళ అంతస్తుల భవనాలు అనేక ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నగరానికి ధీటుగా ఇక్కడి స్థలాలకు డిమాండ్ పెరుగడంతో బహుళంతస్తుల భవనాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి.

**వాళ్ళిద్దరు వసూళ్ళ కింగ్‌లు..** సర్కిల్ 23 డిప్యూటీ కమిషనర్(డీసీ) కార్యాలయం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ ఇద్దరు అధికారులు అవినీతి సామ్రాట్‌లుగా మారారు. రూ.కోట్ల మేర అక్రమ వసూళ్ళే ధ్యేయంగా పెట్టుకున్న సదరు ఇద్దరు అధికారుల జేబులు నిండుతుండగా జిహెచ్‌ఎంసికి రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయానికి గండి పడుతోంది. అక్రమార్జనల్లో రికార్డు సృష్టిస్తోన్న సర్కిల్ 23 కార్యాలయంపై జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులు దృష్టిసారించకపోవడంతో అక్రమార్కులు తమకే అడ్డే లేదన్న ధీమాతో మరింత రెచ్చి పోయి జేబులు నింపుకోవడానికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి జిహెచ్‌ఎంసి ఆదాయానికి తూట్లు పొడుస్తూ జిహెచ్‌ఎంసిని దివాళా తీయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ అపార్ట్‌మెంట్లు చేపడుతున్న బిల్డర్లు, నిర్మాణదారుల వద్ద రూ.కోట్ల మేర వసూళ్ళు చేస్తున్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులతో పాటు సర్కిల్ ఉన్నతాధికారికి ఫిర్యాదులు అందుతున్నప్పటికీ సదరు అధికారులు అసలు పట్టించుకోవడంలేదు. నివాస యోగ్య భవనాలకోసం అనుమతి పొంది కమర్షియల్ భవనాల్ని నిర్మిస్తున్నా సర్కిల్ 23 సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ) కారా ్యలయంలో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ అధికారి పట్టించుకోకుండా జేబులు నింపుకోవడానికి మాత్రమే పరిమితయ్యాడనే ఆరోపణలు ఉన్నాయి.

## తెలంగాణ జాతి గర్వించదగిన వ్యక్తి వట్టికోట ఆళ్వారు స్వామి



ప్రసంగిస్తున్న తెలంగాణ పోలీసుహౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్త

చిక్కడపల్లి, నవంబరు 14 ప్రభాతవార్త: తెలంగాణ జాతి గర్వించదగిన వ్యక్తి వట్టికోట ఆళ్వారు స్వామి అని తెలంగాణ పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్త అన్నారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన రచయిత, ఉద్యమకారుడు, గ్రంథాలయోద్యమ నాయకుడు వట్టికోట ఆళ్వార్‌స్వామి యాదిలో సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కొల్లేటి దామోదర్ గుప్త వట్టికోట ఆళ్వార్‌స్వామి చిత్రపటానికి నివాళులు అర్పించి ప్రసంగించారు. తెలంగాణ జాతి గర్వించదగిన వ్యక్తి వట్టికోట ఆళ్వారు స్వామి అని, ప్రజలకు ఆయన చరిత్రను తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాబోయే తరాలకు ఆయన చరిత్ర స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు జయసూర్య, జీవిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుడిబండి వెంకటరెడ్డి, త్యాగరాయ గానసభ సంయుక్త కార్యదర్శి తాళ్ళపల్లి చక్రపాణి పాల్గొన్నారు.

## ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులుగా దేవుడు కుమార్

మెట్టుగూడ, నవంబర్ 14 ప్రభాతవార్త: ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడుగా మెట్టుగూడ డివిజన్‌కు చెందిన బీజేపీ ఎస్సీ మోర్చ ఉపాధ్యక్షులు దేవుడు కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు నగరంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు భైరి వెంకటేశం మోచి పస్తం దేవుడు కుమార్‌కు నియామకపు పత్రాన్ని అందజేసి అభినందించారు. ఎస్సీ 57 ఉపకులాల ప్రజల హక్కుల సాధన కోసం, సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని దేవుడు కుమార్ పేర్కొన్నారు. ఎంతో మంది బేడబడగ సంఘాల ప్రజలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని వారిని ఏకం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కుమార్ చెప్పారు.

## నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు

**ఎమ్మెల్సీ వాణీదేవి**



బేగంపేట నవంబరు14, ప్రభాతవార్త : నేటి బాలలే రేపటి భారత భావి పౌరులని, విద్యార్థులు సన్మార్గంలో నడిపించేందుకు ఉపాధ్యాయ పాత్ర కీలకమని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ అజిత అన్నారు. మంగళవారం బాలల దినోత్సవం పురస్కరించుకొని బేగంపేట బ్రాహ్మణవాడీ స్వామి రామానందతీర్థ మెమోరియల్ మోడల్ స్కూలులో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. పోటీలో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమా జంలో పిల్లలకు సన్మార్గంలో నడిపించేందుకు తల్లి దండ్రులు ప్రత్యేక కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ వాసుకి, ఇంచార్జి అరుణసిరి పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ వడ్డెర సంఘం ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్



జీడిమెట్ల, నవంబర్ 14, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ వడ్డెర సంఘం ఆత్మీయ సమావేశంలో బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం తరపున బిజెపికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వడ్డెరులు అణచివేయబడ్డారన్నారు. రెండుసార్లు బిఆర్ఎస్ పార్టీ ఓట్లు వేయించుకుని మోసం చేసిందని, గతంలో తాను వడ్డేరలకు 15 ఎకరాల స్థలం కేటాయించి ఇండ్ల పట్టాలు ఇప్పించామని తెలిపారు. తాను గెలిచాక ఇండ్లు, పెన్షన్లు, రేషన్ కార్డులు ఇప్పించే బాధ్యత నాదేనని అన్నారు. వడ్డెరులకు ప్రత్యేక భవనంతో పాటు స్థలాన్ని కేటాయిస్తానని తెలిపారు. సంచార జాతుల కమీషన్ జాతీయ సభ్యులు తుర్క నరసింహా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా అత్తాపూర్‌లో బాలల దినోత్సవం



మైలార్‌దేవ్‌పల్లి, నవంబరు 14 ప్రభాతవార్త : అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అత్తాపూర్ నారాయణ పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నారాయణ పాఠశాలల జోనల్ ఏజిఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భారత దేశ ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. చదువులో ప్రతిభ కనపరిచిన బాల బాలికలతో పాటు క్రీడలలో విజయం సాధిం చిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ మధుమతి, ఏఓ సుదర్శన్, తులసీ, విద్యాదేవితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి ఆకర్షితులై బిఆర్ఎస్‌లో చేరుతున్నారు : మంత్రి కెటిఆర్



కెటిఆర్, మాధవరం సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరికలు

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 14, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి కెసిఆర్ అమలు పరుస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల వారు తమవైపు మొగ్గు చూపుతున్నారని మంత్రి కెటిఆర్ పేర్కొన్నారు. మంగళవారం మంత్రి కెటిఆర్ సమక్షంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సీనియర్ నాయకులు ఏనుగుల తిరుపతి ఆధ్వర్యంలో బిజెపి మేడ్చల్ జిల్లా జనరల్ సెక్రటరీ అన్వర్, బిజెపి సెక్రటరీ దేవేందర్‌తోపాటు అర్భత్, నియామత్ ఫరీద్, ఫతేనగర్ డివిజన్ జనరల్ సెక్రటరీ ఇబ్రహీంతో పాటు మొత్తం 100మంది కాంగ్రెస్ బిజెపి నేతలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీకి కండువా కప్పి కెటిఆర్ స్వాగతించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులమై బిఆర్ఎస్ పార్టీలో చేరామని సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్రం శాంతిభద్రతలతో పాటు అన్ని రంగాల్లో ముందుకు వెళుతుంద న్నారు.

**మద్దతు ప్రకటించిన మార్వాడి సంఘం..** ముసాపేట్ డివిజన్ నగర్‌కు చెందిన 50మంది యువత మాధవరం కృష్ణారావు సమక్షంలో మాజీ కార్పోరేటర్ తూము శ్రవణ్ కుమార్ ఆధ్వర యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరుతూ మాధవరం కృష్ణారావు గెలుపుకి కృషి చేస్తామని తెలిపారు. అలాగే మూసాపేట్‌లోని మార్వాడి సంఘం వారు తమపూర్తి మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మాణం చేశారు.

## అభివృద్దే బీఆర్ఎస్‌ను గెలిపిస్తుంది : మంత్రి తలసాని

**దేవిడీ.తబేలా,వికార్‌నగర్,భగవంతాపూర్ ఇంటింటి ప్రచారం**

బేగంపేట నవంబరు 14, ప్రభాతవార్త : గడచిన తొమ్మిదిన్నర సంవత్సరాల చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే తిరిగి బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి,మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. మంగళవారం బేగంపేట డివిజన్ లోని దేవిడీ, తబేలా, వికార్‌నగర్, భగవంతాపూర్ లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో అడుగడుగునా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంత్రికి నుదుటన కుంకుమ తిలకం దిద్ది మంగళహారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన 50సంవత్సరాలలో జరగని అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణా ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగాయని తెలిపారు. 2014కు ముందు ఇక్కడి నుంచి గెలిచిన వారు నియోజకవర్గ అభివృద్ధి ప్రజా సమస్యలను విస్మరించారని, విమర్శించారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వచ్చే వారని, ఎన్నికల అనంతరం అందుబాటులో ఉండే వారు కాదన్నారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాతనే సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. మంత్రి వెంట కార్పోరేటర్ మహేశ్వరి డివిజన్ అధ్యక్షుడు



బేగంపేట డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న తలసాని

శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, అమరం శ్రీనివాసరెడ్డి, ఆరిఫ్, నాయకులు నరేందర్‌రావు,శేఖర్,అఖిల్, మెయినోద్దిన్, జావీద్,ప్రవీణ్ పాల్గొన్నారు.

**తలసానికి మద్దతుగా ఎంఐఎం ప్రచారం..** సనత్‌నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఎంఐఎం నేతలు తెలిపారు. మంగళవారం బేగంపేట డివిజన్‌లో తలసాని శ్రీనివాస్‌యాదవ్ నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. తలసానికి మద్దతుగా ఎంఐఎం నేతలు ఇర్ఫాన్, ఇమ్రాన్‌ఖాన్, మహమూద్ ప్రచారంలో పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ శైలజ, శీనయ్య, పాండురంగా చారి తదితరులు

## నేటి విద్యార్థులు భవిష్యత్ సమాజ నిర్మాతలు

**సిఎస్ఐఆర్ సైంటిస్ట్ డాక్టర్ శైలజ**

హైదరాబాద్,నవంబర్ 14,ప్రభాతవార్త: నేటివిద్యార్థులు రేపటి భవిష్యత్ సమాజ నిర్మాతలు అని సిఎస్ఐఆర్ ఛీఫ్ సైంటిస్ట్ డాక్టర్ శైలజ అన్నారు. ఈమేరకు మంగళవారం బౌరంపేటలో దిక్రిక్‌ప్లానెట్ స్కూల్ మెరిక్యూరీ క్యాంపస్ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఈకార్యక్రమంలో చైర్మన్ బొల్లినేని శీనయ్య, వైస్ చైర్మన్ పాండురంగాచారి, ఫౌండర్ డైరెకర్టర్ నరేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



అందంగా ముస్తాబు చేసిన దున్నపోతులతో విన్యాసాలు చేయిస్తున్న దృశ్యం

# సదర్ సందడి

**ఆకట్టుకున్న దున్నపోతుల విన్యాసాలు.. వైభవంగా సదర్ సమ్మేళనం**

హైదరాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త : దున్నపోతుల విన్యాసాలు..యాదవుల చిందులతో సదర్ సమ్మేళనం వైభవంగా కొనసాగింది. దీపావళి అనంతరం యాదవులు సంబరంగా జరుపుకునే సదర్ ఉత్సవాలు మంగళవారం రాత్రి నారాయణగూడలో ప్రారంభమయ్యాయి. అందంగా ముస్తాబు చేసిన దున్నపోతులతో విన్యాసాలు చేయించారు. నారాయణగూడ లింగంపల్లిలో రాత్రి 8 గంటలకు ఉత్సవాల వ్యవస్థాపకుడు సలంద్రి చౌదరి మల్లయ్యయాదవ్ కుటుంబసభ్యుల పర్యవేక్షణలో యాదవ ప్రతినిధులు సంప్రదాయ బద్ధంగా సదర్ పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. వైఎంసిఎ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ప్రధాన వేదిక వద్దకు యాదవ సోదరులు ముస్తాబు చేసిన దున్నపోతులను తీసుకొచ్చి ఆశీర్వచనం చేయించారు. సదర్ ఉత్సవాలతో నారాయణగూడ వైఎంసిఎ చౌరస్తా, ఫ్లైఓవర్ రోడ్డు, కాచిగూడ వీరసావర్కర్ చౌరస్తా, ప్రధాన వేదిక ఉన్న బర్కత్‌పుర రోడ్డులోని ఛమన్ చౌరస్తా ప్రజలతో కిక్కిరిసిపోయాయి. విద్యుత్ దీపాలు, తోరణాలతో అలంకరించిన శకటాలు..వాటిపై అందంగా ముస్తాబై రాజసం ఉట్టిపడే విధంగా నిలబడిన దున్నపోతులు తరలిరావడంతో ఫ్యాషన్ షో పరేడ్‌ను తలపించింది. శిక్షణ ఇచ్చి దున్నపోతులతో విన్యాసాలు ప్రదర్శించారు. బ్యాండ్ మేళాలతో భారీ ఊరేగింపులతో పాల్గొన్నారు. ఊరేగింపుల ఎదుట దున్నపోతుల యజమానులు, బంధువులు నృత్యాలు, కర్రసాము, కత్తిసాము చేశారు. వేడుకలను తిలకించేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు రావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లను నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, కాచిగూడ కార్పోరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. సదర్ ఉత్సవాల సందర్భంగా నారాయణగూడలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఫ్లైఓవర్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాత్రి తొమ్మిది గంటల తర్వాత కాచిగూడ చౌరస్తా నుంచి చిక్కడపల్లి వైపు వెళ్లే వాహనాలను లింగంపల్లి వైపు నుంచి మళ్లించారు.

# క్రైస్తవులకు హామీ ఇచ్చిన పార్టీకే సంపూర్ణ మద్దతు

**వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటి**



సమావేశంలో మాట్లాడుతున్న రాధామాథ్యూస్

సైఫాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త: క్రైస్తవుల అభివృద్ధి, సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చిన పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటి ప్రకటించింది. క్రైస్తవులు, నన్స్, పాస్టర్లపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, అరెస్టులు, చర్చిలు కూల్చివేతలు రోజు, రోజుకు పెరిగిపోతున్నాయని, మణిపూర్, గాజాలో ఊచకోతలు జరుగుతున్నాయని, మహిళలు, పిల్లలపై పాశవిక దాడులు జరుగుతున్నాయని యూనిటి ఆందోళన వ్యక్తం చేసింది. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటి అధ్యక్షుడు సాధు సత్యనాథ్, ప్రతినిధులు డా.రాధా మ్యాథ్యూస్, డా.సుక్కా డానియేల్, బిషప్ ఆనంద్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ క్రైస్తవులకు ప్రత్యేకంగా రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాస్టర్లకు ఇస్తున్న మాదిరిగా నెలు 5 వేలు గౌరవ వేతనం చెల్లించాలని, హెల్త్ కార్డులు పంపిణి చేయాలని, డబుల్ బెడ్ రూమ్‌లు అందించాలని, క్రైస్తవుల స్మశానవాటికలకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులంతా శాంతి కాముకులని, అందరితో కలిసి మెలిసి ఉంటారని వారు స్పష్టం చేశారు. క్రైస్తవుల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, రాజకీయాల్లో ఏలాంటి పదవులు లేవని, రాజకీయ పార్టీలు కేవలం ఓటర్లుగానే వాడుకుని వదిలివేస్తున్నాయని, సంక్షేమం, అభివృద్ధి గురించి ఆలోచించడం లేదని వారు ఆరోపించారు. ఈ సమావేశంలో యూనిటి ప్రతినిధులు సాలోమెన్, కన్నా డానియేల్, సురేష్, సునీల్, సుధాకర్, రవికిరణ్ పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ అసెంబ్లీ ప్రజలంతా నా బలగమే : ప్రకాశ్‌గౌడ్

**ఎన్నికల బిక్షగాళ్లకు గుణపాఠం తప్పదు**

నార్సింగి, నవంబర్ 14 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రజలంతా నా బలగమేనని, ఎన్నికల వేళ వచ్చే బిక్షగాళ్లకు ఇక్కడి ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ మున్సిపల్ బిజెపి ఓబిసి సెల్ జెనరల్ సెక్రెటరీ నరేష్, బిజెవైఎం కార్యదర్శి బక్కమొల్ల కుమార్, శంషాబాద్ మున్సిపల్ 20.వ,వార్డు కుమ్మరి బస్తీకి చెందిన 200.మంది కార్యకర్తలు బిఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారందరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ తొమ్మిదిన్నరేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పతకాలకు ఆకర్షితులై బిజెపి, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బిజెపిలో చేరుతున్నారని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పతకాలను ఇచ్చామని, ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మీ/షాదీ ముబారక్, కేసీఆర్ కిట్లు, రైతు బంధు, రైతు భీమా, ఇంటింటికి సురక్షితమైన మంచినీటి సరఫరా వంటివి ప్రతీ కుటంబానికి చేరాయన్నారు. సంక్షేమ ఫలాలు పొందిన ప్రతీ ఒక్కరూ కారు గుర్తుకే గుద్దుతామని డిసైడ్ అయ్యారని తెలిపారు. ఇన్నాళ్ల ఇళ్లల్లో పడుకున్న ప్రతిపక్ష పార్టీలు, ఓట్ల బిక్షగాళ్లు ఇప్పుడు వచ్చి మాకే ఓట్లేయాలని అడిగితే ప్రజలు ఎలా నమ్ముతారని, ఏనాడైనా ప్రజల ఇబ్బందులు పరిష్కరించాలని ధర్నాలు చేశారా? ఉద్యమాలు చేశారా? ఎలా వీరికి ఓట్లు వేస్తారని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులను వారు చెప్పక ముందే మేమే వారి వద్దకు వెళ్లి అడిగి పరిష్కరించామన్నారు. పని చేసిన వారిని ప్రజలు పది కాలాల పాటు గుర్తుంచుకుంటారని, ఎన్నికల సమయంలో సరైన నాయకుడికే ఓట్లు వేసి మరోమారు గెలిపించుకుంటారని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. 15.ఏళ్ల క్రితం రాజేంద్ర నగర్ నియోజకవర్గం ముఖచిత్రం ఎలా ఉండే.. ఇప్పుడెలా ఉందో.. ఓ సారి గమనించి, ఇంత లా అభివృద్ధి చేసిన నాకే ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రకాశ్‌గౌడ్ ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు గణేష్ గుప్తా, దూడల వెంకటేష్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, మేకల వెంకటేష్, సరికొండ వెంకటేష్ పాల్గొన్నారు.



రాజేంద్రనగర్‌లో బీజేపీని వీడి బిఆర్ఎస్‌లో చేరుతున్న వారికి గులాబి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


గాంధీ ఆస్పత్రిలో చిల్డ్రన్స్‌డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న వైద్యులు

## గాంధీ ఆస్పత్రిలో బాలల దినోత్సవం

సికింద్రాబాద్, నవంబర్ 14 ప్రభాతవార్త : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా జరిపారు. పిడియాట్రిక్ సర్జరీ విభాగం, తెలంగాణ రాష్ట్ర డీఎంఈ డాక్టర్ కె. రమేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సమక్షంలో కేక్ కట్‌చేసి వారికి అందజేశారు. దీంతో పాటు బాలల దినోత్సవ కార్యాక్రమంలో బాగంగా పిల్లలకు బహుమతులు అందజేశారు.

## బ్రాహ్మణవాడీ సమస్యను పరిష్కరిస్తా

**కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా.కోట నీలిమ**


బ్రాహ్మణవాడీలో ప్రచారం నిర్వహిస్తున్న కోట నీలిమ

బేగంపేట నవంబరు 14,ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రాహ్మణవాడీ ప్రాంతంలోని సమస్యలను పరిష్కరిస్తానని, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ అన్నారు.మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బ్రాహ్మణ వాడీలో వరదు వచ్చినపుడు కాంగ్రెస్ పార్టీ స్థానికులకు అండగా నిలిచిందన్నారు. బ్రాహ్మణవాడీ నాలా సమస్యను ఎన్ని సంవత్సరాలు అయినా ఎందుకు పరిష్కరించలేకపోయారని ఆమె ప్రశ్నించారు.బస్తీ సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న నాయకులను ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఖచ్చితంగా చేరుతాయని ప్రకటించారు.

## సందడిగా బాలల దినోత్సవం



హైదరాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త : నేటి బాలలే రేపటి పౌరులు అని ప్రధానోపాధ్యాయురాలు స్వాతిరెడ్డి, జన్నపురెడ్డి అన్నారు. మంగళవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని హబ్సిగూడ భాష్యం లిటిల్ చాంప్స్‌లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రత్యేక నృత్య కార్యక్రమాలను చేపట్టారు. అదేవిధంగా స్పోర్ట్‌మీట్‌ను సైతం నిర్వహించారు. చిన్నారులలో మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. భవిష్యత్తులో ఈ చిన్నారులే దేశానికి పునాదుల అని శ్రీచాయలిటిల్ చాంప్స్ ప్రిన్సిపల్ అన్నారు.

## సదరు వేడుకల్లో పాల్గొన్న జంపనప్రతాప్




కంటోన్మెంట్, నవంబర్ 14 ప్రభాతవార్త: నగరంలోని నారాయణగూడ వైఎంసీఏ వద్ద నిర్వహించే తరహాలో సదరు ఉత్సవాలు బోయిన్‌పల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో బారీ ఎత్తున సదరు వేడుకలు నిర్వహించడం అభినందనీయమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. సోమవారం రాత్రి బాపూజీ నగర్‌లో బాను యాదవ్, చిన్నతోకట్టలో నవీణ్ యాదవ్, కార్తీక్ యాదవ్, జగదీశ్ యాదవ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సదరు వేడుకల్లో జంపన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 77 యేండ్లుగా బోయిన్‌పల్లిలో సదరు ఉత్సవాలు బారీ ఎత్తున నిర్వహిస్తున్నారన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి దున్న పోతులను తీసుకు వచ్చి సుందరంగా అలంకరించి ఊరేగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు తుమ్మల మల్లేశ్ యాదవ్, విటల్ యాదవ్, వెంకటేశ్ యాదవ్, ముఖేశ్ యాదవ్, బచన్ రాజు యాదవ్, వెంకటేశ్ యాదవ్, హన్మంత్ యాదవ్, కిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

## 18,19 తేదీల్లో కాశీనాధుని వారి విశ్వనాథ భక్తి ప్రవచనాలు

హైదరాబాద్, నవంబర్ 14,ప్రభాతవార్త: ధర్మవర్తిని శాంతా వసంత ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 18,19తేదీల్లో ఖైరతాబాద్‌లోని దిఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ భవన్‌లో "కాశీనాధుని వారి విశ్వనాథ భక్తి " కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు షణ్ముక చరణ్ తెలిపారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శాంతా వసంత ట్రస్ట్ చైర్మన్ కె.వరప్రసాద్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. ఈసందర్బంగా షణ్ముక చరణ్ మాట్లాడుతూ దివంగత దర్శకులు కళాతపస్వీ కె.విశ్వనాథ్ దర్శకత్వం వహించిన పలు చిత్రాల్లోని భక్తిరస పాటల్లోని విశేషాలను తీసుకుని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచనాల రూపంలో వివరిస్తారని తెలిపారు.

## తెలంగాణ ప్రగతిని ఉరుకులు పెట్టించిన నేత సీఎం కెసిఆర్

**ఎమ్మెల్యే కెపి వివేకానంద**



పేట్‌బషీరాబాద్, నవంబర్ 14, ప్రభాతవార్త : 129 సూరారం డివిజన్ న్యూ శివాలయ నగర్‌లో జరిగిన చేరికల కార్యక్రమంలో జై హనుమాన్ యూత్ సభ్యులతో సోమవారం రాత్రి 200మంది యువకులు, మహిళలు ఎమ్మెల్యే కెపి వివేకానంద సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ళ కాలంలో సీఎం కెసిఆర్ సంక్షేమ పథకాలు, అభివృద్ధితో తెలంగాణ రాష్ట్రం దేశ తలసరి ఆదాయాన్ని మించిన అభివృద్ధితో ముందుకు సాగుతున్నారు. ప్రజా సంక్షేమ పాలనా భవిష్యత్తును అంచనా వేయగల ఏకైక నాయకుడు సీఎం కెసిఆర్ అని అన్నారు. జైహనుమాన్ యూత్ సభ్యులు ప్రభాకర్, బాలప్రసాద్, యాదగిరి, హరీష్‌గౌడ్, ఆనంద్, పాండు, ప్రశాంత్, బాలు, శ్రీను, సాయి, ఘనీ, జలాలీ, ఖలీల్‌లు బిఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి సిద్దిఖ్, సీనియర్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, తారాభాయ్, గోపాల్ నాయక్, షెహనాజ్‌బేగం, కవిత పాల్గొన్నారు.

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తక్షణమే రద్దు చేయాలి

**దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్**

సైఫాబాద్, నవంబర్ 14, ప్రభాతవార్త: బీసీల విద్య, ఉద్యోగ అవకాశాలకు గొడ్డలి పెట్టులాంటి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తక్షణమే రద్దుచేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో, రాష్ట్రజనాభాలో అత్యధికంగా ఉన్న బీసీల అవకాశాలను కొల్లగొడుతున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బడుగు బలహీన వర్గాలకు తీవ్రంగా అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్‌పై స్పందించని ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణకు కమిటీ వేస్తామని చెప్పటం మోసపూరితంగా ఉందని అన్నారు. బీసీలకు చెందాల్సిన చెందాల్సిన రాజ్యాధికారం దోపిడీ కులాలు అనుభవిస్తున్నాయని ఆరోపించారు. అగ్రకుల పేదలు ఈడబ్ల్యూఎస్ ముసుగులో బీసీల అవకాశాలను తన్నుకుపోతున్నారని. తక్షణమే వీటిని ద్దుచేయాలని, లేనిపక్షం పెద్దఎత్తున పోరాడతామని హెచ్చరించారు. ఈ కార్యనరకమంలో బీసీ నాయకులు దేవునూరి శ్రీనివాస్, ఎమ్.డి.హుస్సేన్, బీరం సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కులమతాలకు అతీతంగా సదరు వేడుకలు


బోయిన్‌పల్లి సదర్ వేడుకల్లో పాల్గొన్న జక్కుల మహేశ్వర్ రెడ్డి

కంటోన్మెంట్, నవంబర్ 14 ప్రభాతవార్త: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని యాదవ్‌లు ప్రతి ఏటా నిర్వహించే సదరు వేడుకలు కులమతాలకు అతీతంగా నిర్వహించడం అభినందనీయమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి బోయిన్‌పల్లియాదవ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదరు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు టి.మల్లేశ్ యాదవ్, చైర్మన్ బి.సంతోష్ యాదవ్, అధ్యక్షులు వెంకటేశ్ యాదవ్, ప్రతినిధులు ఓం ప్రకాశ్ యాదవ్, రాము యాదవ్, పుల్లయ్య యాదవ్, మహేశ్ యాదవ్, విష్ణు, బంటీ, పాండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


5వ వార్డు వాల్మీకి నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త తదితరులు

కంటోన్మెంట్, నవంబర్ 14 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 5వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త తెలిపారు. మంగళవారం 5వ వార్డులోని వాల్మీకి నగర్, సంజీవయ్య నగర్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు,డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు అస్తవ్యస్థంగా ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. తన దృష్షికి వచ్చిన సమస్యలను బోర్డు అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు.



గండిపేట మండలం వట్టినాగులపల్లి, గౌలిదొడ్డిలలో బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ అధ్యక్షుడు రామేశ్వరం నర్సిమ్మా, మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, మేకల ప్రవీణ్ యాదవ్, నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖా యాదగిరి, సీనియర్ నేతలు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, గొల్ల నాగేష్ యాదవ్, తోల్‌కట్ట కృష్ణ, వెంకటేష్, సంతోష్, రాజు తదితరులు

## ప్రజా సంక్షేమం కోసం అనునిత్యం తపించే ఏకైక నాయకుడు సిఎం కెసిఆర్ : ఎమ్మెల్యే కెపి వివేకానంద


సమావేశంలో మాట్లాడుతున్న వివేకానంద

జీడిమెట్ల, నవంబర్ 14, ప్రభాతవార్త : 125 గాజులరామారం డివిజన్ చంద్రగిరి నగర్‌లో ఎమ్మెల్యే కెపి వివేకానంద మంగళవారం చేరికల కార్యక్రమం నిర్వహించి అనంతరం బిఆర్ఎస్ నాయకులు మహమ్మద్ రహీం, జావిద్, ఓబైసీల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో నూతనంగా చేరిన జావీద్ వారి మిత్రబృందంలోని 100మంది యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భం గా వివేకానంద మాట్లాడుతూ గత తొమ్మిదిదేళ్ళ కాలంలో గాజులరామారం డివిజన్‌లో అనేక నిధులు కేటాయించి సిసి రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి కష్టాలను తీర్చామని, రానున్న రోజుల్లో గాజురామారంలోని అన్ని కాలనీలలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మనకోసం మన సంక్షేమం కోసం అనునిత్యం తపించే నాయకుడు సీఎం కెసిఆర్ ద్వారానే అభివృద్ధి సాధ్యమని, నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. అనంతరం మహమ్మద్ సిద్దిక్, మహమ్మద్ ఖాజా ఓవైసి, మహమ్మద్ ఇంతియాజ్, మహమ్మద్ రహీం, మహమ్మద్ హాపీజ్, అమిత్ కుమార్, షేక్ మసీదుద్దీన్, షేక్ అజీజ్, ముజాహిద్, ఇర్ఫాన్ పటేల్, మహమ్మద్ షకీల్, మహమ్మద్ జహంగీర్, మహమ్మద్ అజీమ్, మహేష్‌గౌడ్, మన్సూర్ మహమ్మద్, గంగాధర్, మహమ్మద్ హాజీ, సయ్యద్ ఆసిఫ్, పవన్, అమర్‌నాథ్, మల్లీశ్వరి, సుజాత, లక్ష్మీ, రేష్మ, ఫాతిమాబీ, సుభద్ర, రజిత, మరియమ్మ, యాదమ్మ, దేవి, షమీంలతో పాటు 100మంది యువకులు, మహిళలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, రసీద్ బేగ్, కమలాకర్, పర్వ శ్రీనివాస్ యాదవ్, సింగారం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులెన్నో చేశాం.. మరోసారి ఆశీర్వదించండి

**శేరిలింగంపల్లి బిఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ.. ఆరెకపూడి గాంధీకి మంగళహారతులు పట్టిన మహిళలు**


ప్రచారంలో బిఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీకి మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 14 ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ఎన్నో అభివ ృద్ధి పనులు చేపట్టామని, తాము చేసిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించి, మరోసారి ఓటువేసి గెలిపించాలని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ ప్రజలను కోరారు. గత తొమ్మిదిన్నరేళ్ల కాలంలో శేరిలింగంపల్లిలో జరిగిన అభివ ృద్ధిని చూసి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటువేయాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గోపన్‌పల్లి గ్రామం, వీకర్‌సెక్షన్ కాలనీల్లో గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంతకుముందు గోపన్‌పల్లి రంగనాథస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్‌ప్లాట్స్‌లో బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని క ృషినగర్, ఎంఎనగర్, స్టాలిన్ నగర్, ప్రశాంత్‌నగర్, రెడ్డి కాలనీ, మక్తా మహబూబ్‌పేట్ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. మియాపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్, బిజెపీలకు చెందిన కార్యకర్తలు ఆరెకపూడి గాంధీ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రచారంలో పాల్గొన్న ఆరెకపూడి గాంధీకి గోపన్‌పల్లిలో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ గత తొమ్మిదిన్నరేళ్ల కాలంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో దాదాపు 9వేల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్ ముదిరాజ్, రాజునాయక్, చెన్నంరాజు, సత్యనారాయణ, వేణు గౌడ్, అరుణ్‌రాజు, భీమ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొద్దిపాటి జాగ్రత్తలతో మధుమేహాన్ని నియంత్రించవచ్చు

ధర్నాచౌక్, నవంబర్ 14, ప్రభాతవార్త: కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తూ ఉంటే మధుమేహాన్ని తేలికగా నియంత్రించవచ్చునని డాక్టర్ అశ్వఫక్, హాసన్, డాక్టర్ సరస్వతిలు అన్నారు. మంగళవారం ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ముషీరాబాద్‌లో ఏర్పాటుచేసిన సైక్లోథాన్ అవగాహనా కార్యక్రమంలో భాగంగా పేషెంట్ కేర్ కనెక్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఇంట్లో మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉండటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. మధుమేహాన్ని నియంత్రించాలంటే సమతుల అహారపు అలవాట్లు, జీవలన శైలిలో మార్పులతో పాటు శారీరక శ్రమ, క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కేర్ హాస్పిటల్ సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ జే.సూర్య ప్రకాష్, జనరల్ ఫిజీషియన్ కే.ఎన్.మోయినుద్దీన్, ఇమ్రాన్ఖాన్, సయ్యద్ అబ్దుల్ అలీం, శ్రీలత, డాక్టర్ అబ్దుల్ నఫీ, రాజేందర్, సతీష్, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.


సికింద్రాబాద్ రాంగోపాల్‌పేటలోని నల్లగుట్టలో సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, 1st FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT HYDERABAD**

**OA No. 725 of 2023**

**Union Bank of India ...Applicant**
**And**
**Akula Ramu ...Defendants**

**SUBSTITUTED SERVICE OF SUMMONS UNDER RULE 23 (viii) OF DRT (PROCEDURE) RULES, 1993**

**To,**
**3. Akula Ramu,**
**S/o. Akula Lakshminarayana,**
**Aged: 38 Yrs, Occ: Business,**
**R/o. Sy No. 790, Koheda,**
**Hayathnagar,**
**Ranga Reddy-501511.**

Whereas the Applicant has instituted an Application under Section 19 of the Recovery of Debts due to Banks and Financial Institution Act, 1993 against you for recovery of a sum of **Rs.31,29,166.63ps** together with future interest and other reliefs and the Hon'ble Tribunal ordered notice to you, by way of paper publication in "Vartha" Daily News Paper and posted the matter to 22-12-2023.

You are hereby required to show cause on **22-12-2023** at 10.30 AM at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001 in person or through Advocate, as to, why the relief prayed for should not be granted. Take notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the 14th day of November, 2023.

**Asst. Registrar**
**Debts Recovery Tribunal-II**
**1st Floor, Triveni Complex, Abids,**
**Hyderabad- 500001**

**IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE CUM V METROPOLITAN MAGESTRATE MEDCHAL MALKAJGIRI DISTRICT, UPPAL AT : L.B.NAGAR**
**O.S.NO. 637 / 2023**

BETWEEN:
**1. Guda. Jyothsna,** W/o. Late Guda. Jalapathi, Age:37 yrs, Occ: Hose Wife.
**2. Guda. Ashmith Reddy,** D/o. Guda. Jyothsna & Late Guda.Jalapathi, Age: Plaintiff No.2 minor rep.by her mother plaintiff no.1
All are R/o. H.No.5-3/1/154, Venkat Reddy Colony Street No.4, behind academic heights, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri District, Telangana - 500092. **...Plaintiffs**
AND
**All Concerned ...Defendants**

**NOTICE**

Whereas the above named plaintiffs filed the case for Declaration of deceased Guda. jalapathi, S/o. Guda. Papi Reddy, in respect of suit schedule property against the respondents and the said case is posted to **24-11-2023** for your appearance at **10:30 AM.** Before the said court in person or through Advocate on the date and time mentioned be heard on your absence and decided ex-party.

**SCHEDULE PROPERTY**

All that piece and percel of H.No. 5-3/1/154, Plot No.154,Southern Part Survey No.35, 36 & 51(as per Pahani Survey No.s 35, 36, 51/aa, 51/e, 51/ee) admeasuring 152 sqyds, or 127.07 sqmtes, known as "AmmasaniVenkat Reddy Colony."Situated at "Boduppal Muncipal Corporation "Medipally Mandal, Medchal-Malkajgiri District. H.No. 5-3/1/154, Plot No.154 Southern Parties bounded by North: Plot No.154 Northen Part, South: Plot No.153, East: Plot Nos.158 & 159, West: 25' Wide Road.

(By Order Of The Court)
**Sd/- V. PRABHAKAR REDDY**
**ADVOCATE**
HYDERABAD
**Phone No.9848513160**

## ఇండియా బుక్ఆఫ్ రికార్డులో పేరు సంపాదించుకున్న చిన్నారి ధాన్విత శ్రీసాయి



యూసుఫ్‌గూడ, నవంబర్ 14, ప్రభాత వార్త: నగరంలోని ఓ చిన్నారి ఇండియా బుక్ఆఫ్ రికార్డులో పేరు నమోదు చేసుకుంది. మోతీనగర్ పరిధి లోని సారధినగర్‌కు చెందిన కాస్ట్యూమ్ డిజైనర్ శ్రీను తడాల, లక్ష్మీ నాగసంతోషి దంపతుల కుమార్తె ధన్విత శ్రీసాయి(2) ప్రస్తుతం మధురానగర్ శ్రీనిధి కిడ్స్ కాస్టిల్ ప్రీ ప్రైమరీ స్కూల్‌లో నర్సరీలో చదువుతుంది. ఎంతో మేధాశక్తితో ధరాలంగా దేశంలోని రాష్ట్రాలు, వాటి రాజధానిల పేర్లను ఇట్టే చెబుతుంది. అంతే కాకుండా 40 శ్లోకాలను అనర్గలంగా చెబుతుంది. వీటితో పాటు 21 ఇంగ్లీష్ రైమ్స్, 15 తెలుగు రైమ్స్, 9 గాడ్ శ్లోకాలు, 3 హిందీ రైమ్స్, జాతీయగీతం, 40 రకాల పక్షులు, జంతువులను గుర్తుపట్టడం,30 రకాల ఫుడ్ ఐటమ్స్, 16 రకాల పండ్లు, 25 రకాల కూరగాయల పేర్లు, ఆసుపత్రి పరికరాలను గుర్తించడం, 10 రకాల వాహనాలను, రోజులు, నెలలు, తేదీలు గుర్తించడం, కథలు చెప్పడం, కుటుంబ సభ్యుల పేర్లను చెప్పడం, తెలుగు పాతలు పాడటం వంటి ప్రావీణ్యం కలిగిన ధన్విత చిన్నారి ఇండియా బుక్ఆఫ్ రికార్డు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో బాలల దినోత్సవం కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్‌రావు ప్రత్యేకంగా అభినందించారు.ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గీత, విమల, రాజేశ్వరి, ఇన్‌చార్జ్‌లు విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభివృద్దే ఇండియా ప్రజాబంధు లక్ష్యం

**వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ అద్దంకి రంజిత్ ఓఫీర్**



హైదరాబాద్, నవంబర్ 14, ప్రభాతవార్త: రాష్ట్రంలోని బడుగు బలహీనవర్గాలు, మహిళల అన్నివర్గాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ఇండియా ప్రజాబంధుపార్టీ పనిచేస్తుందని ఆపార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ అద్దంకి రంజిత్ ఓఫీర్ అన్నారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ పార్టీనుంచి పోటీ చేస్తున్న 34మంది అభ్యర్థులను పరిచయం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలైన అంబేడ్కరిస్ట్ పార్టీగా తమపార్టీ పనిచేస్తుందన్నారు. ఈకార్యక్ర మంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దెల అరుణ్, ఉపాధ్యక్షులు అందుకూరి విజయభాస్కర్, కోశాధికారి తోట నర్సింహులు, జాతీయ సంయుక్త కార్యదర్శి యాదాల అబ్బులు, మహిళా బంధు అధ్యక్షులురాలు షీబా, రాష్ట్ర అధ్యక్షులు పాలమాకుల మధు, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్‌లో జోరుగా కాంగ్రెస్ ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

**మర్పల్లి నవంబర్ 14 ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలోని తిమ్మారూర్ గ్రామంలో మంగళవారం నాడు కాంగ్రెస్ నాయకులు జిల్లా గ్రందాలయ మాజి చైర్మెన్ కొండల్‌రెడ్డి, టి.డి.పి మాజి జిల్లా అధ్యక్షులు సుబాష్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు రవెందర్, పలువురు నాయకులు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మాజి మంత్రి గడం ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలనిబీఆర్ఎస్ పార్టీ వారి మాటలు నమ్మరాదని, వారు ఓటర్లను కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ...గత పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలారని, రైతులకు సకాలంలో రుణమాఫీ చేయకపోవడంతో రైతులకు నాలుగింతలు రుణం పెరిగిపోహిందని అన్నారు. సంవత్సరానికి లక్ష ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు రోడ్లపై పడ్డారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరుగ్యారంటి పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుందన్నారు. రైతులకు రెండు లక్షలరుణమాఫీ, మమిళలకు నెలకు 2500ల రూపాయలు, ఉచిత ఆర్టీపి ప్రయాణం పలు సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాని వారు కోరారు. ఈసమావేశంలు పలువురు నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మర్పల్లిలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నాయకులు

**మర్పల్లి నవంబర్ 14 ప్రభాతవార్త :** మర్పల్లి మండల కేంద్రరంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు జడ్పిటీసి మదుకర్ మండల ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి గ్రామ కమిటి అధ్యక్షులు గఫర్ పలువురు ఇంటింటి ప్రచారం నివ్వహించారు కాంగ్రేస్ వారి మాటలు నమ్మి ఓటువేస్తే రాష్ట్రం అదోగతి పాలవుతుందని బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి మెతుకు ఆనంద్‌ను గెలిసించాలని వారు ఓటర్లను కోరారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విదంగా మన రాష్ట్రంలో పలు సంక్షేమ పథకారులు అమలవుతున్నాయని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్షంగా బీఆర్ఎస్ పని చేస్తుందని, ప్రతి సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారునికి చేరుతున్నాయని వారు అన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ సక్షేమ పథకాలు అదుతున్నాయని, సంక్షేమ పథకం అంది ఇల్లులేని వారు తెలిపారు రైతు బీమ, రైతు బందుతో రైతులకు కేసిఆర్ భరోసా ఇచ్చారని తెలిపారు కాంగ్రేస్ పాలనలో కరెంటు కష్టాలు, నీటి ఎద్దడితో ప్రజలు పడరాని పాట్లు పడ్డారని, కాంగ్రేస్‌కు ఓటు వేస్తే తిరిగి అదేగతికి తెస్తారని అన్నారు అందరి అందుబాటులో ఉంటు ప్రజా సంక్షేమం, గ్రామాల అబివృద్దికి నిరంతరం కృషిచేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్‌కు ఓటువేసి గెలిపించాలని వారు కోరారు ఈకార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తులు పాల్గోన్నారు.

## విద్యార్థిలే ఉపాధ్యాయులైన వేళ



**పరిగి నవంబరు14, ప్రభాతవార్త :** పరిగి మున్సిపల్ పరిధిలో సుదీక్ష ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించి స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకోవడం జరిగింది. విద్యార్థులు డిఈవోగా, ఎంఈఓగా, ప్రధాన ఉపాధ్యాయుల, ఉపాధ్యాయునిగా అయి స్వయంగా తరగతి గదిలోకి వెళ్లి పాఠశాలను బోధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పెండెంట్ వీరేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపుదాం
### -సతీమణి సబితా ఆనంద్



మేనిఫెస్టో వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి సబితా ఆనంద్

**దారూర్ నవంబరు14, ప్రభాతవార్త :** మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపుదామని వికారాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ సతీమణి డాక్టర్ సబితా ఆనంద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుక్కింద గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న కెసిఆర్‌ను మూడోసారి సిఎం చేయాలని నవంబరు30న కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుగ్గమ్మ, జడ్పిటిసి సుజాత, వేణుగోపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాజు నాయక్, మాజీ ఎంపిపి ఉమా పార్వతి, గ్రామ యూత్ ప్రెసిడెంట్ మహిపాల్, గ్రామవార్డు మెంబర్లు వెంకటయ్య, రఫిక్, బిచ్చయ్య, రాములు, నర్సింలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఎస్‌కేఆర్ ట్రస్ట్ ఆర్థిక సాయం

**మర్పల్లి నవంబర్14 ప్రభాతవార్త:** మర్పల్లి మండలంలోని పట్లూర్ గ్రామానికి చెందిన ఒగ్గె నాగేష్ అనారోగ్యంతో సోమవారం నాడు మృతిచెందగా, అట్టి విషయం తెలుసుకున్న ఎస్ కే ఆర్ ట్రస్ట్ చైర్మెన్ జిల్లా గ్రందాలయ మాజీ చైర్మెన్ సనగారి కొండల్‌రెడ్డి, వారి అంత్యక్రియలకు 5వేల రూపాయలు పంపగా, సొసైటి చైర్మెన్ ప్రవీన్‌రెడ్డి, పంచలింగాల్ సర్పంచ్ సురెందర్‌రెడ్డి పట్లూర్ సర్పంచ్ గ్రామస్తులు కలసి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్క్రమంలో పలువురు నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



బాలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



దుద్యాల నేతాజీ పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

**కొడంగల్ నవంబర్ 14 ప్రభాతవార్త :** బాలల దినోత్సవ వేడుకలను కొడంగల్ మండలంలోని వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు ఆటపోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట్ మండలంలో...**

**బొంరాస్‌పేట్, నవంబర్ 14 ప్రభాతవార :** చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని రేయిన్ బో పాఠశాల కరస్పాండెంట్ పి.రాఘవేందర్‌యాదవ్ అన్నారు. మంగళవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని రేయిన్‌బో పాఠశాలతో పాటు దుద్యాల మండల కేంద్రంలోని నేతాజీ విద్యానికేతన్ పాఠశాలల్లో భారతదేశ మొట్టమొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని, బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా జరు పుకున్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు విద్యార్థులకు వివిధ సాంస్కృతిక(ఆటలు, పాటలు) కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్వేత, రఘు, హైమద్, అన్వర్, శ్రీనివాస్, పార్వతి, కవిత, స్వరూప, యాదమ్మ, జయశ్రీ, సన, నవనీత, సమీన్, సాగరిక పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వాహణకు పకడ్బందీ ఏర్పాట్లు
### - ఎన్నికల సాధారణ అబ్జర్వర్ ఆకాష్
### - తాండూరులో పోలింగ్ కేంద్రాల పరిశీలన

**తాండూరు, నవంబరు 14, ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల నిర్వాహణకు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఎన్నికల సాధారణ అబ్జర్వర్ ఆకాష్ తెలిపారు. మంగళవారం తాండూరు పట్టణంలోని ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్థానిక ఎన్నికల సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలలో కావాల్సిన ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల నిర్వాహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, త్రాగునీరు, మూత్రశాలలు, ర్యాంపులు తదితర మౌళిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. అధికారి వెంట స్థానిక ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అబ్జర్వర్ ఆకాష్

# కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
### -కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి



గిరిగెట్‌పల్లి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి

**వికారాబాద్, నవంబర్ 14, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నాయని, త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుని అధికారం చేపట్టడం ఖాయమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని గిరిగెట్‌పల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడవల్లే అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్న చోట నిధులు వెచ్చించే వారు కాదని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యే ఆనంద్ దుర్మార్గపు ఆలోచనలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, మరో సారి ఆ తప్పు చేయవద్దని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శాటిలైట్ సిటీ కింద 180 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధి చేయడం జరిగిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పైసా నిధులు కూడా వికారాబాద్ పట్టణానికి కెటాయించలేదని విమర్శించారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జీ పనులకు కోట్ల నిధులు కెటాయించామని, కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప ఆచరణలో సాధ్యం కాలేదని అన్నారు. గతంలో మెతుకు ఆనంద్ గెలుపునకు కృషి చేసిన వారినే విస్మరించడం వల్లనే అమ్మలాంటి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని ఆయన అన్నారు. ఎమ్మెల్యే ఆనంద్ రియల్ వ్యాపారినికి ఇచ్చిన సమయాన్ని నియోజకవర్గ అభివృద్ధి కి కెటాయించలేరని విమర్శించారు. మరోసారి ఆనంద్‌కు ఓటు వేస్తే అభివృద్ధిలో 40 ఏండ్లు వెనక్కు వెళ్ళినట్లేనని అన్నారు. ప్రజల కోసం పాటుపడే ప్రసాద్‌కుమార్ కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుర్లపల్లి మంజుల, కౌన్సిలర్లు దేవి, చందర్‌నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచెంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ ముత్తహర్‌షరీఫ్, నాయకులు రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# శామీర్‌పేట మండలంలో కాంగ్రెస్ పార్టీ రోడ్‌షో

**శామీర్‌పేట, నవంబరు 14, ప్రభాతవార్త** మేడ్చల్ ఎమ్మెల్యేగా ఓ సారి గెలిపించాలని, అభివృద్ధి చేసి చూపిస్తానని, కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుందని, ప్రజలు ఆదరిస్తున్నారని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ (జంగయ్యయాదవ్) పేర్కొన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని పొన్నాల్, బొమ్మరాసిపేట, బాబగూడ, లాల్‌గడిమలక్‌పేట్, అలియాబాద్, తుర్కపల్లి, యాదారం, మురహరిపల్లి, మజీద్‌పూర్, శామీర్‌పేట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగ రోడ్‌షో కార్యక్రమం జరిగింది. శామీర్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్ అధ్వర్యంలో రోడ్‌షో కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగ మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణలో, మేడ్చల్‌నూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బిఆర్ఎస్ ప్రభుత్వం పట్ల, మేడ్చల్ నియోజకవర్గంలోనూ మల్లారెడ్డితో విసుగు చెందుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని, మేడ్చల్‌లోనూ కాంగ్రెస్ రావాలని కోరుకుంటున్నారని ఆయన అన్నారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం, సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అలియాబాద్ లో ఉన్న ప్రధాన సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పరిష్కరించటానికి కృషి చేస్తామని, మేడ్చల్‌లో వజ్రేశ్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్‌ను గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై.శంకర్ గౌడ్, బి.జైపాల్‌రెడ్డి, బి.నర్సింలుయాదవ్, ఎంపిటిసిలు ఎస్.అశోక్‌రెడ్డి, ఎస్.ఇందిర, సర్పంచు బి.సుకన్యసత్యనారాయణగౌడ్, మాజీ సర్పంచు జి.గౌరికు మారివెంకటేశ, మండల కోఆప్షన్ మెంబర్, టిపిసిసి మైనార్టీసెల్ కోఆర్డినేటర్, ఎండి ముజీబ్, మండల కాంగ్రెస్ నాయకులు ఎం.మహేందర్‌యాదవ్, కె. కృష్ణారెడ్డి, జి.వెంకటేశ, యు.వెంకటేశ, వై.నాగేశ్వర్ గౌడ్, రాంరెడ్డి, ఎం.మల్లేశ్, బిక్షపతి, భరత్, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, నర్మద, అర్జున్‌గౌడ్, కాంగ్రెస్, సిపిఎం నాయకులు వై.ఎలయ్య, కిష్టప్ప, పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన నాయకులు..**

శామీర్‌పేట మండల నాయకులు వి.అశోక్, శామీర్‌పేట గ్రామ నాయకులు డి.ఎల్లం, కె.బాల్‌రామ్, ఆర్. శ్రీనివాస్, హీరాలాల్, నర్సింగ్, రాజులు బిఆర్ఎస్ నుంచి మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్ యాదవ్ సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీనిలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై.శంకర్ గౌడ్, మండల నాయకులు ఎం.మహేందర్‌యాదవ్, ఎండి ముజీబ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలతో పేదల సంక్షేమం
### - అనన్యచేతన్

**కోట్‌పల్లి, నవంబరు 14, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలతో పేదల సంక్షేమం సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ కూతురు అనన్యచేతన్ అన్నారు. మంగళవారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని కంకణాలపల్లి గ్రామంలో అమె ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రచారం ఇంటింటికి వెళ్ళి ప్రజలతో వివరించారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ. పేదల సంక్షేమాన్ని అలోచించి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రకటించిందన్నారు. మహిళల కోసం ఆర్థిక సాయం, రూ,500, వందలకే వంట గ్యాస్, బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతులకు భరోసా కింద పెట్టుబడి ఆర్థిక సాయం, యువతకు ఉద్యోగలు, 200, యూనిట్లు ఉచితంగా ఇందిరమ్మ ఇల్లు, వంటివి ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులకు ఒకేసారి 2, లక్షల రూపాయాలు, రైతు రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు, ఈఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటువేసి భారీ మోజార్టీతో ప్రసాద్‌కుమార్ గెలిపించాలన్నారు. గత పది సంవత్సరాల నుంచి తెలంగాణ రాష్ట్రంలో వికారాబాద్ నియోజక వర్గంలో ఎలాంటి అభివృద్ధి నోచుకోలేదన్నారు. గత కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులే తప్పా ఎలాంటి అభివృద్ధి జరుగలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వికారాబాద్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని అమె దీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింగ్‌నాయక్, బీసీసెల్ అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రాములునాయక్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కంకణాలపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ కూతురు అనన్యచేతన్

# ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
### -బిఆర్ఎస్ నాయకులు పెద్ది అంజయ్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు పెద్ది అంజయ్య

**వికారాబాద్, నవంబర్ 14, ప్రభాతవార్త:** ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికల ప్రచారాన్ని ఏ పార్టీ వాళ్లు అడ్డుకున్న పోలీసు వారు చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలని బిఆర్ఎస్ నాయకులు పెద్ది అంజయ్య డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మెతుకు ఆనంద్ ను సిద్దులూరు గ్రామంలో ప్రచారం నిర్వహించగా కొందరు ఆ ప్రచారాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దానిని వ్యతిరేకిస్తూ మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మెతుకు ఆనంద్ కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, దాన్ని ఓర్వలేక కాంగ్రెస్ వారు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాలలో నిత్యం తిరుగుతున్నామని ప్రజలు మొత్తం బిఆర్ఎస్ వైపే ఉన్నారని తెలిపారు. 30 వేల మెజార్టీతో బిఆర్ఎస్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. వృద్ధులు, వికలాంగులు పింఛన్ దారులు, సంక్షేమ పథకాలు అందిన వారందరూ బిఆర్ఎస్ వైపు ఉన్నారన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ఎన్నికల్లో ఎవరి ప్రచారాన్ని వాళ్ళని నిర్వహించుకునే స్వేచ్ఛ ఉందని, దాన్ని అతిక్రమిస్తే చట్టపమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని గుర్తు చేశారు. బిఆర్ఎస్ అభ్యర్థి మెతుకు ఆనంద్ మళ్ళీ గెలిపిస్తే అందుబాటులో ఉండి ప్రజల సేవ చేస్తారని, వికారాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని, ఆ పార్టీ అభ్యర్థిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు నర్సింలు, మనోహర్ రెడ్డి, రత్నం తదితరులు ఉన్నారు.

# ఘనంగా క్రైస్తవ కోతకాల పండుగ



ఘట్‌కేసర్ గాస్పెల్ లోకల్‌చర్చిలో కోతకాల పండుగలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, సీఎంఆర్ హెల్త్‌సిటి చైర్మన్ భద్రారెడ్డి

**ఘట్‌కేసర్, నవంబర్ 13, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలోని గాస్పెల్ లోకల్ చర్చిలో కోతకాల పండుగ (హార్వెస్ట్ ఫెస్టివల్) ఘనంగా నిర్వహించారు. చర్చిలు ఫాస్టర్లు, నిర్వహకులు కోతకాల పండుగ ప్రాధాన్యతను వివరించారు. వివిధ రకాల పళ్లతో వేదికను అలంకరించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, సీఎంఆర్ హెల్త్‌సిటి చైర్మన్ చామకూర భద్రారెడ్డిలు ముఖ్య అతిథిగా విచ్చేసి ఉత్సవంలో పాల్గొని మాట్లాడారు. క్రైస్తవ సాంప్రదాయం ప్రకారం చర్చిలో హార్వెస్ట్ ఉత్సవాన్ని జరిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైఎస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మున్సిపల్ బీఆర్‌ఎస్‌పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు బండారి అంజనేయులుగౌడ్, బేతాల నర్సింగ్‌రావు, కోఆప్షన్ సభ్యురాలు బొట్టు అరుణ కృపానిధి, మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు, కీసరగుట్ట మాజీ డైరక్టర్ మెరుగు నరేశ్‌గౌడ్, నాయకులు మందిడి శ్రీనివాస్‌రెడ్డి, బర్ల హరిశంకర్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న వైస్ ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి



వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అనంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన బంట్వారం వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

**బంట్వారం, నవంబరు 14, ప్రభాతవార్త;** బంట్వారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం నాడు వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మండలానికి చెందిన పలు గ్రామాల కార్యకర్తలతో పాటు తొరుమామిడి గ్రామస్తులు పార్టీలు చేరారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో మరో మారు బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని ఆకాంక్షతో నేడు పార్టీలో చేరినట్లు అని చెప్పారు. తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలన్నా కెసిఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాలనిదీంతో పాటు నియోజకవర్గం అభివృద్ధి కావాలన్నా ఆనంద్‌తోనే సాధ్యమని అన్నారు. ఈకారణంగానే తాను పార్టీలో చేరినట్లు ఆయన పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు బల్వంత్‌రెడ్డి సుధాకర్‌గౌడ్, అచ్యుతంరెడ్డి పాల్గొన్నారు.

## కోటి దీపోత్సవానికి టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**హైదరాబాద్, నవంబర్ 14, ప్రభాతవార్త :** ప్రతీ ఏటా కార్తీక మాసంలో నిర్వహించే కోటి దీపోత్సవం కార్యక్రమానికి టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎన్టీయార్ స్టేడియంలో పదిహేను రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి నగరంతో పాటు నగర శివార్ల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతుంటారు. దీని దృష్ట్యా టీఎస్ఆర్టీసీ నగరంలోని పలు రూట్లలో, శివార్ల నుంచి ప్రత్యేక సర్వీసులను పదిహేను రోజుల పాటు నడుపనుంది. ఇందుకోసం కోఠి, జేబీఎస్‌లో ఆర్టీసీ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను సైతం ఏర్పాటు చేసింది. కోటి దీపోత్సవం కార్యక్రమానికి హాజరయ్యే భక్తులు ఈ హెల్ప్ లైన్‌ను సంప్రదించి ఏ రూట్‌లో బస్సులు ఏ సమయానికి బయలుదేరుతాయో తెలుసుకోవచ్చని టీఎస్ ఆర్టీసీ తెలిపింది.

## విజ్ఞాన్ బోట్రీ స్కూల్‌లో ఆకట్టుకున్న విద్యావైజ్ఞానిక ప్రదర్శన

**నిజాంపేట్, నవంబర్ 14, ప్రభాతవార్త** విజ్ఞాన్ బోట్రీ స్కూల్ నిజాంపేటలో బాలల దినోత్సవం సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన ఎలక్ట్రానిక్ విభాగ ఆచార్యులు డాక్టర్ పి.నవీన్ కుమార్, శ్రీశ్రీ హోల్టిక్ హాస్పిటల్స్ డైరెక్టర్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్.విజయలక్ష్మీ, అఖిలభారత తృణధాన్యాల పరిశోధన సంస్థ ఇన్చార్జ్ డైరెక్టర్ విశారద విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడానికి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని, విజ్ఞాన్ ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందించాల్సిన విషయమన్నారు. సైన్స్, మ్యాథ్స్‌తో పాఠుట సాంఘిక శాస్త్రానికి వివిధ భాషలకు సంస్కృతి సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వటం ప్రశంసనీయమని తెలిపారు. ఈ ప్రదర్శనలో మొత్తం 580 ప్రాజెక్టులు, 1900మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించినటువంటి వివిధ ప్రాజెక్టులను చూసి, విద్యార్థులు చెప్పిన వివరాలు విని అతిథులు సంతోషించి అభినందించారు. విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్‌చైర్ పర్సన్ రాణి రుద్రమదేవి మాట్లాడుతూ విజ్ఞాన్ మొదటి నుండి కూడా విద్యార్థులలోని సృజనాత్మకత వెలికితీయటానికి కృషచేస్తుందని, విజ్ఞాన్ బోట్రీ స్కూల్‌లో అన్ని హంగులు కలిగిన ప్రయోగశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వివిధ సబ్జెక్టుల కో ఆర్డినేటర్స్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన కోటిదీపోత్సవం

**ధర్నాచౌక్, నవంబర్ 14, ప్రభాతవార్త:** లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో నిర్వహించే కోటి దీపోత్సవ కార్యక్రమం మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయింది. మొదటి రోజు జగద్గురు శివరాత్రి దేశికేంద్రమహాస్వామి అనుగ్రహ భాషణంతో ప్రారంభమయిన కార్యక్రమం డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి ప్రవచనామృతం, కాశీస్పటిక లింగానికి సహస్ర కలశాభిషేకం, కోటి మల్లెల పూజ, శ్రీశైల మల్లిఖార్జునస్వామి కళ్యాంణం, అనంతరం హంస వాహనసేవతో ముగిసింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు జడ్జి శ్రీసుధ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. మంగళవారం ప్రారంభమయిన ఈ కోటి దీపోత్సవ కార్యక్రమం ఈనెల 27 వరకు కొనసాగుతుందని, ప్రతి రోజూ సాయంత్రం ఆరు గంటల నుండి పది గంటల వరకు కొనసాగుతుందని మీడియా కోఆర్డినేటర్ కే.రాఘవేంద్ర తెలిపారు.

## శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అన్నదానం



.శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, నవంబరు 14, ప్రభాతవార్త** శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయం ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. శ్రీ రేణుకాఎల్లమ్మ ఆలయంలో శామీర్‌పేట గ్రామానికి చెందిన స్వర్గీయ గుర్రాల కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య ప్రేమలత, కుమారులు శ్రీనివాస్‌రెడ్డి-రమ్య, సునీల్‌రెడ్డి-సుకన్య దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు, రాజీవ్‌రహదారిన వెళుతున్న ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి మరోసారి పట్టం కట్టండి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సుధీర్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న నాయి బ్రాహ్మణులు

**హయత్‌నగర్,ఎల్బినగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతిపక్షాలకు స్థానం లేదని... కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ మరోసారి అత్యధిక స్థానాలను గెలుచుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్‌డివిజన్ పరిధి బంజారా కాలనీలో పాటు సమీప కాలనీలకు చెందిన 100 మంది యువకులు, మహిళలు యువనాయకుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభివృద్ధి ధ్యేయంగా బీఆర్ఎస్ పాలన సాగుతోందని, కొత్తగా వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పే వారిని నమ్మకూడదన్నారు. 15 సంవత్సరాలుగా ఎల్.బి.నగర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నానని తెలిపారు. గతంలో ప్రతి వర్షాకాలంలో బంజారా కాలనీ నీటమునిగేదన్నారు. బాక్సు డ్రైన్లు, వరదనీటి కాలువలను నిర్మించి ముంపు సమస్యను పూర్తిగా పరిష్కరించానని వివరించారు. నగరంలోని ఇతర కాలనీలకు ధీటుగా బంజారాకాలనీలో సీసీరోడ్లను ఏర్పాటు చేశామన్నారు. బంజారా కాలనీ ప్రధాన రహదారిని సీసీగా మార్చిన తరువాత వాహనదారుల రాకపోకలు ఇబ్బందులు పూర్తిగా తొలగిపోయాయని తెలిపారు. అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి తనను గెలిపిస్తే మరింతగా అభివృద్ధి చేసిచూపిస్తానన్నారు. ఈసందర్భంగా యువత సుధీర్‌రెడ్డికి పూర్తిగా మద్ధతు తెలుపుతున్నామని ఖచ్చితంగా గెలిచేది సుధీర్‌రెడ్డినేనని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామతిరుమల్‌రెడ్డి, పార్టీ డివిజన్ కమిటీ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, నాయకులు భాస్కర్‌సాగర్, మల్లేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

**సుధీర్‌రెడ్డికి మద్దతుగా నాయి బ్రాహ్మణులు...** ఎల్బీనగర్ టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దేవి రెడ్డి సుధీర్ రెడ్డికి కొత్తపేట డివిజన్ నాయి బ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు మంగళవారం మద్దతు తెలిపారు. సుధీర్‌రెడ్డి విజయం కోసం తాము పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తించి సరైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీవి సాగర్ రెడ్డి, ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్, మాజీ అధ్యక్షుడు రాగిరి ఉదయ్ గౌడ్ పాల్గొన్నారు. టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దేవీరెడ్డి సుధీర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ జీవీ.సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ఈస్ట్ మారుతినగర్ లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాగిరి ఉదయ గౌడ్, లింగాల నిఖిల్ గౌడ్ పాల్గొన్నారు.

## మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధి కాంగ్రెస్ ద్వారానే సాధ్యం : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి

**హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 14 ప్రభాతవార్త:** మూసీ పరివాహక ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని పదిహేనేళ్లుగా కల్లబొల్లి మాటలు చెబుతూ ఎమ్మెల్యే అబ్దుల్లాపూర్‌మెట్ మండల ప్రజలను మోసం చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మంగళవారం మండలంలోని బండరావిరాల, చిన్నరావిరాల, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట, కవాడిపల్లి, బలిజగూడ గ్రామల్లో పర్యటించారు. ప్రచారంలో సీపీఐ శ్రేణులు సైతం రంగారెడ్డికి మద్ధతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూసీ పరివాహక ప్రాంతాల్లో రోడ్లు దుర్భరంగా ఉన్నాయని, దోమలు, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూసీకి సమాంతరంగా రోడ్డు నిర్మిస్తామని, ఎస్‌టీపీలను ఏర్పాటుచేసి మురుగును తొలగిస్తామని మర్పల్లి, ప్రతాపసింగారం మధ్య బ్రిడ్జి నిర్మాణం చేస్తామని మూడు పర్యాయాలు ఎన్నికల్లో గెలిచి హామీలను విస్మరించారన్నారు. బండరావిరాల మైనింగ్ జోన్ బాధిత రైతులకు కొంత మందికి పరిహారం అందించి మిగతావారిని వదిలేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ఆర్భాటాలు చెప్పిన కేసీఆర్ మేడిగడ్డ పరిస్థితిని చూసిన తరువాత ఎన్నికల్లో దాని మాట ఎత్తడం లేదన్నారు. ధనిక రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల్లోకి తీసుకువచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి మినహా ఇబ్రహీంపట్నంలో కొత్తగా చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల ద్వారా తిరిగి తెలంగాణలో ప్రజా పాలన తీసుకువస్తామని, ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేయిగుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో యువకులు భారీగా కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తట్టిఅన్నారంలో మల్‌రెడ్డి రాంరెడ్డి తన సోదరుడు రంగారెడ్డికి మద్ధతుగా ప్రచారంలో పాల్గొన్నారు. పెద్దఅంబర్‌పేటలో మల్‌రెడ్డి రంగారెడ్డి కోడలు స్నేహారెడ్డి, కౌన్సిలర్లు మల్‌రెడ్డి దీపిక, పండుగుల జయశ్రీ, మాజీ కౌన్సిలర్ గంట అనుపమలక్ష్మారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మర్రి నిరంజన్‌రెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, బింగిదాసుగౌడ్, కొత్తప్రభాకర్‌గౌడ్, బుర్రమహేందర్, కొత్తపల్లిజైపాల్‌రెడ్డి, సీపీఐ నాయకులు ముత్యాల యాదిరెడ్డి పాల్గొన్నారు.

**బిఎస్‌పినుండి కాంగ్రెస్‌లో చేరికలు...** తుర్కయాంజాల్ బిఎస్‌పి పార్టీ అధ్యక్షుడు వద్దిగళ్ల బాబు కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు.



గౌరెల్లిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి



బాబు తన అనుచరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మల్‌రెడ్డి

## అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ మహేశ్వరం : సబితాఇంద్రారెడ్డి



బిఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి సమక్షంలో చేరిన యువకులు



సదర్ మేళాలో పాల్గొన్న కౌశిక్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** గడచిన ఐదేళ్ళ కాలంలో మహేశ్వరం నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యురాలు గుర్రం ప్రసన్నవెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక 23వ డివిజన్‌కు చెందిన ఇండిపెండెంట్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ సాతిరి భాస్కర్‌తో పాటు పలువురు యువకులు మంత్రి సబితారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె పార్టీలో చేరిన వారికి గులాబి కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఆకర్షితులై ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున యువకులు, మహిళలు చేరుతుండడం హర్షణీయమన్నారు. అభివృద్ధి,సంక్షేమం కొనసాగాలనే ఉద్దేశం తో బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్న వారికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అందరి ఆకాంక్షలకు అనుగుణంగా మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామని ఆమె స్పష్టం చేశారు.

**గొల్ల, కురుమల సంక్షేమానికి పెద్ద పీట...** బిఆర్ఎస్ పాలనలో గొల్ల, కురుమల సంక్షేమానికి సిఎం కెసిఆర్ ప్రాధాన్యతనిచ్చారని సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లో జరిగిన యాదవుల సదర్ సమ్మేళనానికి ఆమె తన కుమారుడు, యువనేత పట్లోళ్ళ కౌశిక్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాదవులు, కురుమలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం తోడ్పాటునందించిందని అన్నారు. ఈ ఎన్నికల్లో తనకు మద్దతు పలుకుతున్న యాదవులు, కురుమలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, యాదవ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం : బిఎల్ఆర్



బిఎల్ఆర్‌కు మద్దతు ప్రకటిస్తున్న క్యాబ్ డ్రైవర్స్ అసోసియేషన్ నేతలు



బిఎల్ఆర్‌కు మద్దతు తెలుపుతున్నట్లు పత్రాలను చూపిస్తున్న కార్మిక నేతలు

**ఉప్పల్, నాచారం, నవంబరు 14 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీతోనే ప్రజలకు తగు న్యాయం జరుగుతుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ఆధ్వర్యంలో ఉప్పల్ ప్రైవేటు క్యాబ్ డ్రైవర్స్ అసోసియేషన్ నేతలు సాయికుమార్, రాజుగౌడ్, రంజిత్ ఆధ్వర్యంలో పలువురు క్యాబ్ డ్రైవర్లు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కారుతోనే తాము ఉపాధి పొందుతున్నామని, కారు గుర్తుకే ఓటు వేస్తామని కార్మికులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలకు సముచిత న్యాయం అందించేందుకు సిఎం కెసిఆర్ ఎంతో కృషి చేస్తున్నారని, ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి బిఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్‌రావు, కె.జగన్, సీనియర్ నేతలు నెర్ధం భాస్కర్‌గౌడ్, కోల రవి కుమార్‌గౌడ్, పల్లె రాజ్‌కుమార్‌గౌడ్, బింగి శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, తిరుపతి యాదవ్, శ్యామ్, బాలు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు..

**బిఎల్ఆర్‌కు కార్మికులు మద్దతు...** మల్లాపూర్‌లోని విఎన్ఆర్ గార్డెన్‌లో బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, ఉపాధ్యక్షులు హమాలి శ్రీను ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అర్హులైన కార్మికులకు దళిత బందు, బీసి బందు, గృహలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు అందే విదంగా చూస్తానని హామినిచ్చారు. తనగెలుపు కోసం కార్మికులు ఓటు వేసి గెలిపించాలని బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్మికులు బిఎల్ఆర్‌కు మద్దతు తెలుపుతున్నట్లు ఏకగ్రీవ తీర్మాణ పత్రాలను బిఎల్ఆర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి రావుల చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, యూనియన్ నాయకులు రూప్‌చంద్, బూర్గు మారుతీరావు, కొరపాక అంజయ్య, మధు, శిక కృష్ణ, పాండు నాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ పవనాలు.. అధికారం తథ్యం : లక్ష్మారెడ్డి



కాం గ్రెస్‌లో చేరిన సమరసింహారెడ్డిని ఆలింగనం చేసుకుంటున్న కెఎల్ఆర్

**సరూర్‌నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** తెలంగాణలో ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. బడంగ్‌పేట్ మున్సిపాలిటీకి చెందిన సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు పెద్దబావి సమరసింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు పెద్దబావి నాగనందీశ్వర్‌రెడ్డిలతోపాటు పెద్ద సంఖ్యలో యువకులు కిచ్చెన్నగారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన చేరికల సందర్భంగా లక్ష్మారెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుందనీ ఈ నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ తరపున తాను తప్పక గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

**మీర్‌పేట్‌లో కెఎల్ఆర్ సతీమణి ప్రచారం...** కాగా తన భర్త కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి విజయలక్ష్మి మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో పాదయాత్రలు చేస్తూ పర్యటించిన ఆమెకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగా, వ్యాయామంతో మధుమేహాన్ని నివారించవచ్చు : డాక్టర్ నాగేందర్‌రెడ్డి




రోగికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగేందర్

**వనస్థలిపురం, నవంబర్ 14 ప్రభాతవార్త:** ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా వనస్థలిపురం శ్రీ కృష్ణ డయాబెటిస్ అండ్ ఎండో క్రైన్ ఆసుపత్రి, డయాబెటీస్ కేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించి సుమారు 100 మందికి బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేందర్‌మాట్లాడుతూ మధుమేహ వ్యాధిగురించి భయపడాల్సిన అవసరం లేదని సమతుల ఆహారం, యోగా, వ్యాయామం ద్వారా మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చున్నారు. డయాబెటీస్ ముందుగా గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే కిడ్నీ, గుండె, కంటి నరాల సమస్యలను నివారించవచ్చని తెలిపారు.

## స్వతంత్ర అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేరుతో నామినేషన్

### ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకుల కుట్ర అంటున్న బిఆర్ఎస్ నాయకులు

### సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్న వైనం

**ఎల్బినగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ బిఆర్ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారపార్టీనుంచి నామినేషన్ దాఖలు చేయగా అదేపేరుతో ఉన్న మరో వ్యక్తి నామినేషన్ దాఖలు చేయడం చర్చనీ అంశంగా మారింది. మహేశ్వరానికి చెందిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అనే వ్యక్తి ఎల్బీనగర్ నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేశాడు. అయితే రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేరుతో పోలి ఉన్న వ్యక్తిని వెతికి మరీ పట్టుకొని ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు నామినేషన్ వేయించి ఉంటారని బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు ఆరోపిస్తున్నారు.

ఎల్బినగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఓట్లను చీల్చే కుట్రలో భాగంగానే నామినేష న్ వేయించి ఉంటారని అధికార పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే పేరుతో ఉన్న వ్యక్తితో నామినేషన్ కావాలని వేయించి దింగ దెబ్బ తీసేందుకు కుట్రలు జరుపుతున్నారని బిఆర్ఎస్‌నాయకులు సోషల్ మీడియా ద్వారా తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ చదరంగంలో పావు లు కలపడంలో భాగంగా పలు పార్టీల నాయకులు పలు ట్రిక్కులను ఉపయోగిస్తున్నారు.

## ఎన్నికలలో పోటీలో ఉన్న అభ్యర్థులతో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల అధికారుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంకజ

**ఎల్బినగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికలలో పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన అభ్యర్థులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయం, అనుమతులు, ఎంసిసి గైడ్ లైన్స్ తదితర ఎన్నికల అంశాల గురించి ఎన్నికల అధికారులు వివరించారు.అభ్యర్థులు పది వేల రూపాయల కంటే ఎక్కువ నగదు ఇవ్వరాదని, పది వేల నగదు కంటే ఎక్కువ ఉంచుకోరాదని, పది వేల కంటే ఎక్కువ చెల్లించాల్సి వస్తే నెట్ బ్యాంకింగ్, చెక్ పేమెంట్ ద్వారా చేయాలని వివరించారు. ప్రశాంత వాతావరణములో ఎన్నికలు జరిగే విధంగా అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించే విధంగా ఎవరు వ్యవహరించిన చర్యలు తప్ప ఉన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకుడు, ఐఎఎస్ అధికారి రామ్ కుమార్ సథురప్పన్, ఐఆర్ఎస్, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ ప్రియ రంజన్ శ్రీవాస్తవ, ఐపీఎస్ అధికారి ఉత్పల్ కుమార్ నాస్కర్, ఎల్బీనగర్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.పంకజ, ఈఆర్వో రవీందర్ కుమార్, ఏసిపి జానకి రెడ్డి, నోడల్ అధికారులు వి. అశోక్ రెడ్డి, బి.ప్రసాద్ రావు, ఎమ్ సిసి. పున్నా నాయక్, డి.రణజిత్, పోలీసు సిబ్బంధి, వ్యయ బృందం సిబ్బంధి పాల్గొన్నారు.

## అన్ని వర్గాల మద్దతు తనకే : బిజెపి అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్



ప్రచారంలో బంజారా మహిళలతో బిజెపి అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్

**సరూర్‌నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని అని న వర్గాల మద్దతు తనకే ఉందని వారందరి ఆశీర్వాదంతో ఈ ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తామని నియోజకవర్గ బిజెపి అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తండాలు, గ్రామాల్లో పాదయాత్రలు చేస్తూ ప్రజలను కలిసి తనకు అండగా ఉండాలని కోరారు. గత ఎన్నికల నుండి నిత్యం ప్రజల మధ్యే ఉంటున్నాననీ తనకు ఈ సారి తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తాననీ ఏ సమస్యలు ఉన్నా పరిష్కరిస్తామని ఆయన అన్నారు. తనను గెలిపిస్తే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి, విద్య అవకాశాలు కల్పించి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందెలకు మద్దతుగా రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి తూళ్ళ వీరేందర్‌గౌడ్ తదితరులు ప్రచారం చేశారు.

## కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసిన వారిని ఓడించండి : మధుయాష్కీగౌడ్



మధుయాష్కీగౌడ్‌కు హారతి పడుతున్న మహిళలు

**ఎల్బినగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసి, పార్టీ ఫిరాయింపులు చేసిన వారిని ఎన్నికల్లో ఓడించాలని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధు యాష్కీగౌడ్ విజ్ఞప్తి చేశారు. కొత్తపేట డివిజన్‌లో మధుయాష్కీగౌడ్ పాదయాత్ర రాజీవ్ గాంధీనగర్ మసీదు, శ్రీనివాస కాలనీ, ఆర్టీసీ కాలనీ శివాలయం వరకు మహిళలు కాలనీవాసులు హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అన్నారు. ఈ పాదయాత్రకు అతిథిగా ఏఐసిసి అధికార ప్రతినిధి షమా మహమ్మద్ హాజరయ్యారు. వారు గడప గడపకు తిరుగుతూ, మహిళలకు 2500 పెన్షన్, ఉచిత బస్ సౌకర్యం, గృహ జ్యోతి కింద 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు లింగాల కిషోర్ గౌడ్, ఎస్.కె.షరీఫ్, టిజేఎస్ నాయకులు పల్లె వినయ్, సుజాతరెడ్డి, రజినిరావు, పుష్పలతగౌడ్, రాణి, శైలజరెడ్డి, అబ్దుల్ కరీం, చిన్నాగౌడ్, సాయి, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ గెలుపుకు కృషి చేయాలి : ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి



మర్రి రాజశేఖర్‌రెడ్డికి బొట్టు పెట్టి ఆశీర్వదిస్తున్న మహిళ

**నేరెడ్‌మెట్, నవంబర్ 14 ప్రభాతవార్త:** నేరెడ్‌మెట్ డివిజన్ లక్ష్మిపురి రెసిడెంట్ వద్ద ఏర్పాటు వద్ద ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మల్కాజిగిరి బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో యేళ్ళుగా దీర్ఘకాలిక సమస్యగా మారిన ఆర్‌డబ్ల్యుఎస్ సొసైటీ యాక్ట్‌ని క్రమబద్దీకరించారని, మహిళల అభివృద్ధి, వారి సంక్షేమ కొరకు బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ఒక్కరికి చేరేలా చేస్తామన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటేసి తనను గెలిపించాలని కోరారు.

**ఇంటింటికి ప్రచారం..** నేరెడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి యాప్రాల్ ముత్తుస్వామిలేన్, కల్వరిలేన్, భూపేష్ నగర్, శాంతినగర్, తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి మర్రి రాజశేఖర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, కెఎల్ నారాయణ రెడ్డి, రావుల అంజయ్య, కుతాడి కుమార్, కెకె రావు, జికె హన్మంత్‌రావు, మదుసూధన్‌రెడ్డి, జీవకన్, శివశంకర్‌గౌడ్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా... ఆశీర్వదించండి : బిజెపి అభ్యర్థి రంగారెడ్డి



ప్రచారంలో పాల్గొన్న సామ రంగారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, నవంబర్ 14 ప్రభాతవార్త:** ఈ గడ్డపై పుట్టిన బిడ్డగా, ఎల్బినగర్ బిజెపి అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని తనను ఆశీర్వదించి గెలిపిస్తే నీతివంతమైన పాలనను అందిస్తానని సామ రంగారెడ్డి పేర్కొన్నారు. వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని రాజిరెడ్డినగర్, ప్రశాంత్‌నగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ తనపై తప్పుడు ప్రచారాలు తమ బంధువులు చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రచారంలో తనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక నాపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధి జరగాలంటే బిజెపితోనే సాధ్యమన్నారు. అనంతరం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో అత్యధిక మెజార్టీ తీసుకువస్తానని, ఎల్బినగర్‌లో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్, తడకమళ్ల విజయ్‌కుమార్, నాయిని శ్రీకాంత్‌రెడ్డి, కాలనీవాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.